పద్మాపురం గార్డెన్‌లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-అరకులోయ : స్థానిక పద్మాపురం బొటానికల్ గార్డెన్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం పద్మాపురం గార్డెన్, కొత్తవలస హెచ్ఎంటీసి గార్డెన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ, పద్మాపురం గార్డెన్లో పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా ఎక్కడెక్కడ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా కొత్తవలస హెచ్ఎంటీసీలో కాటేజీల వరకు సిసి రోడ్లను నిర్మించాలని చెప్పారు. మఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అభిషేక్, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బొంజు బాబు తదితరులు పాల్గొన్నారు.

గార్డెన్‌ను పరిశీలిస్తున్న పిఒ

గిరిజన ప్రాంత అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యం

- డిసెంబర్ 2 నుంచి 5 వరకూ సిపిఎం జిల్లా మహాసభ

- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి-అరకులోయరూరల్: గిరిజన ప్రాంతం సమగ్ర అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స తెలిపారు. సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభలు డిసెంబర్ 2,3,4,5 తేదీ లో పాడేరులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో రెండు రోజుల పాటు సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఏళ్ల గడుస్తున్నా రహదారులు లేక అంబులెన్సులు రాక డోలిమోతలతో రోగులను, గర్భిణీను ఆసుపత్రికి తీసుకెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు వైఫల్యం దీనికి కారణమన్నారు. గత ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ తప్పు చేయకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికలు తీసుకురావాలని క్యాబినెట్ నిర్ణయం చేసిందని, సిపిఎం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడే జరపాలన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, గిరిజన ప్రాంతంలో ఆదివాసీల సంస్కృతిని విషం చిమ్మే విధంగా ఆర్ఎస్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. డిసెంబర్లో జరిగే పార్టీ జిల్లా మహాసభల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా అందర్నీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర, నిరుద్యోగ సమస్య, కార్మిక, మహిళల సమస్యలు మహాసభలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రెండు రోజులు జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, దీసరి గంగరాజు, వి.ఉమామహేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, ఎస్‌బి.పోతురాజు, కె.త్రినాథ్, బుజ్జిబాబు, సూరిబాబు, ఎల్.సుందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పంట నష్టాలకు పరిహారమివ్వాలి

ప్రజాశక్తి-కూనవరం : ఇటీవల కురిసిన భారీ వర్షాలలు, వరదలు వల్ల మండలంలో పలు గ్రామాలలో వరి, మిరప, పత్తి పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయని, బాధిత రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం నేతలు కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో పంటపొలాలలో ఇసుక మేటలు వెయ్యడంతో పాటు, పంటలు కొట్టుకుపోచి తీవ్రనష్టం జరిగిందని, ఇంతవరకు పంటనష్టాలపై అధికారులు సర్వే చేయడం లేదన్నారు. పోలవరం ప్యాకేజీ తో సంబంధం లేకుండా పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మూడు నెలలుపాటు వరదలతో ఇబ్బంది పడుతున్న పెద్దార్కూర్, కూటూరు, చూచి రేవులగూడెం, జగ్గవరం సచివాలయాల పరిధిలోని ప్రజలకు నిత్యావసర సరుకుల ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాగమణి, వెంకమ్మ, అమ్మాజీ, నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య, బొగ్గ సుబ్బయ్య, నానుపల్లి వెంకటేశ్వరావు, బాబూరావు . తాల్లూరి శ్రీనివాసరావు, ఆవుల ఉపేందర్ పాల్గొన్నారు

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైస్ ఎంపిపి పెంటయ్య, సిపిఎం నేతలు, రైతులు

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత కుంభవృష్టిగా వాన కురిసింది. అప్పటివరకు ఎండ కాసినప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. కారు మబ్బులు కమ్ముకోవడంతో చీకటి వాతావరణం ఏర్పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై వర్షం మొదలైంది. మధ్యాహ్నం మూడున్నర గంటలకు మొదలైన వాన సాయంత్రం 6 గంటల వరకు కురుస్తూనే ఉంది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది.

అనంతగిరి: మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఘట్ రోడ్డులో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గెడ్డలు. వాగులు పొంగి పొర్లి ప్రవహించాయి.

పాడేరులో కురుస్తున్న వర్షం

అనంతగిరిలోని మర్దగుడలో ప్రవహిస్తున్న గెడ్డ

జాబ్ మేళాలో 102 మంది ఎంపిక

ప్రజాశక్తి- పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీ డా ప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకి 391 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు, వీరిలో పలు కంపెనీలకు 102 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూలో ఎంపికై అభ్యర్థులకు నెలకు జీతం రూ.10,000 నుండి రూ. 20,000 వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో జేడీఎం కల్యాణి, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రూపవతి, జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారి సంగీత, గిరిజన యువ ప్రగతి చైర్మన్ సింహాచలం పాల్గొన్నారు.

తునికాకు డబ్బులు చెల్లించడంలో నిర్లక్ష్యం

సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-చింతూరు : తునికాకు కార్మికులకు డబ్బులు చెల్లించడంలో అటవీశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, తక్షణమే ఐదు నెలల బకాయి చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. గురువారం చింతూరు పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఏప్రిల్, మే మాసాలలో పేద ఆదివాసీలకు ఉపాధిగా తునికాకు సేకరణ చేపడతారని, ఈ ఏడాది మే మొదటి వారంలో సేకరణ చేపట్టిన కార్మికులకు ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చినా, కార్మికులకు ఇవ్వడంలో ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. ఐదు నెలలు పూర్తికావస్తున్న కార్మికులకు డబ్బులను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు, కార్మికుల కూలీ వేతనం తక్షణమే పంపిణీ చేయాలని, లేకుంటే అటవీశాఖ డివిజన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, ఎంపిటిసి ముర్రం లక్ష్మి, మడివి రాజేష్, పొడియం జానీ, దిలీప్ పాల్గొన్నారు,

'బలిమెల' నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై ఇరురాష్ట్రాల అధికారులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీలేరు ఎపి జెన్‌కో అతిథి గృహంలో నిర్వహించిన సమీక్షలో 2024-25 నీటి సంవత్సరంలో ఇరు రాష్ట్రాలు ఎంతెంత నీటిని వినియోగించుకున్నారో లెక్కలు కట్టారు. ఆగస్టు నెలలో ఆంధ్ర తన వాటాగా 4.018 టిఎంసిలు నీటిని వినియోగించుకోగా, ఒడిశా 2.886 టిఎంసిలు నీటిని వినియోగించుకున్నట్లు ధ్రువీకరించారు. ఈ ఏడాది జూలై నుంచి ఆగస్టు 31 నాటికి ఆంధ్ర 7.5405 టిఎంసిలు (2023-24 నీటి సంవత్సరంలో ఒడిశా కంటే అధికంగా వినియోగించుకున్న 0.4028 టిఎంసిల నీటితో కలిపి) నీటిని వినియోగించుకుందని, అదేవిధంగా 15.9641 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం 2024 -25 నీటి సంవత్సరంలో ఒడిశా ఆంధ్ర కంటే 8.4236 టీఎంసీలు నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు.

ఇటీవల ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు బలిమెల, జోలాపుట్ రెండు జలాశయాలలో కలిపి 131.6154 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నట్లు తేల్చారు. ఇందులో ఆంధ్ర వాటాగా 70.0195 టిఎంసిలుగా, ఒడిశా వాటా 61.5959 టిఎంపిలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం ఒడిశాలో కురుస్తున్న వర్షాలు బలిమెల జలాశయం నీటిమట్టం 1612.60 అడుగులకు చేరుకోవడంతోపాటు ఇన్‌ఫ్లో అధికంగా ఉండడంతో నదీ పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని గుర్తించారు. దీంతో జలాశయ నీటిమట్టం పెరగకుండా, 1512.50 అడుగులకు నిర్దిష్టంగా ఉండేలా, ప్రస్తుతం వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోను వచ్చింది వచ్చినట్టుగా ఇరు రాష్ట్రాలు తమ వాటాలను వినియోగించుకోవాలని అంగీకారం కుదుర్చుకున్నారు.

కార్యక్రమంలో ఒడిశా తరఫున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ పితాబాసి చెట్టు, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్ఇ రమాకాంత్ పాత్రా, బలిమెల ప్రాజెక్టు సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్ శివప్రసాద్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయ దాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఓంప్రకాష్ నాయక్, రాకేష్. పాణిగ్రాహి అసిస్టెంట్ ఇంజనీర్ గదదర్ ప్రధాన్ పాల్గొనగా ఆంధ్ర తరఫున సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ (సివిల్) కె.రాంభద్రరాజు, ఇఇ (ఒఅండ్ డ్యాం) వి.రాజేంద్రప్రసాద్, డిఇఇ వెంకట మధు, ఎఇఇ సిహెచ్. సురేష్ పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న ఆంధ్రా ఒడిశా అధికారులు

స్వర్ణాంధ్ర-2047పై అవగాహన ఉండాలి

సంయుక్త కలెక్టర్ అభిషేక్‌గౌడ్

మాట్లాడుతున్నఅభిషేక్‌గౌడ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా అధికారులందరికీ స్వర్ణాంధ్ర 2047పై అవగాహన ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ స్పష్టం చేసారు. గురువారం ఉదయం కలెక్టరేట్ వీసీ హాలులో విజన్ ప్లాన్ స్వర్ణాంధ్ర 2047 పై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, ప్రతి శాఖలో ప్రస్తుత లక్ష్యాలు, రాబోయే ఐదేళ్లలో సాధించబోయే ఫలితాలపై ముందస్తు ప్రణాళికలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలన్నారు. నివేదిక తయారీలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలను రచించాలని చెప్పారు. లక్ష్య సాధనలో ప్రతి ఏటా 15 శాతం ఆర్థిక పురోగతి కనిపించాలని, ఆ విధంగా రాబోయే ఐదేళ్ల వరకు, ముందస్తు ప్రణాళిక తయారు చేయాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోపు మండల స్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని, అందులో ప్రజల, రాజకీయ ప్రతినిదుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆర్థికాభివృద్ధి సాధించే రంగాలపై ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యా, వైద్య, మౌలిక వసతులు, ఇతర సెక్టార్లకు ప్రాతినిధ్యం ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో పర్యాటక, వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు తదితర రంగాల్లో ఆర్థిక పురోగతి ఉండే అవకాశం ఉన్నందున ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. లక్ష్య సాధనలో పేదలందరికీ తప్పనిసరిగా ఇల్లు, ఉచిత వైద్య సేవలు లభించాలని, అర్హులైన వారికీ పింఛను అందాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించాలని, ఆ సభలో ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ, రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే ప్రణాళికలను గ్రామస్తులకు వివరించాలని చెప్పారు. ఇందుకోసం ఆ పంచాయితీకి సంబంధించిన సమగ్ర సమాచారం ఉంచుకోవాలని జేసి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.పద్మావతి, సిపిఓ ఎస్ఎస్ఆర్కే పట్నాయిక్, వ్యవసాయ, ఉద్యాన శాఖల జిల్లా అధికారులు ఎస్బిఎస్ నంద్, రమేష్ కుమార్‌రావు, పట్టు పరిశ్రమ అధికారి అప్పారావు, పశు సంవర్ధక శాఖ అధికారి నరసింహులు, డిఆర్డిఎ పిడి వి.మురళి, డిఎంహెచ్ఓ జమాల్ బాష, డిఇఓ పి. బ్రహ్మాజిరావు, తదితరులు పాల్గొన్నారు.

మనసు దోచిన మన్యం మంచు అందాలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో మంచు అందాలు ప్రకృతి ప్రేమికుల మనసులను దోచాయి. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో బుధ గురువారాల్లో ఉదయం దట్టంగా కురిసింది. ఎపి జోన్‌కో మెయిన్ డాం గ్రామ పరిసర ప్రాంతాల్లో మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను మైమరిపించాయి. పచ్చని చెట్లు ఎత్తైన కొండలు పక్కనే సీలేరు నది పరివాహక ప్రాంతంలో పచ్చని పచ్చిక బయళ్ల వంటి రమణీయమైన దృశ్యాలతో పాటు, దట్టంగా కురుసున్న పొగమంచును చీల్చుకుంటూ ఉదయ భానుడు వస్తున్న దృశ్యాల సీలేరు పరిసర ప్రాంత ప్రజలు ఆస్వాదించి మధురానుభూతిని పొందారు. తర్వాత భానుడు ప్రతాపం చూపుతూ భగభగలాడడంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు అల్లాడిపోయే పరిస్థితి ఉంది. రేయింబవళ్లు వాతావరణంలో చోటుచేసు కుంటున్న మార్పులు ప్రజలను ఒకింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే చెప్పాలి.

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కురుస్తున్న దట్టమైన మంచు

గంజాయి సాగు, రవాణాపై నిఘా

-సిఐ దీనబంధు

ప్రజాశక్తి -పాడేరు: మన్యంలో గంజాయి సాగు, రవాణా పై నిరంతర నిఘా చర్యలు చేపడుతున్నామని పాడేరు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.దీనబంధు వెల్లడించారు. ఇటీవల ఆయన పాడేరు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా తొలిసారి మీడియాతో స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యువత గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి పోవద్దని హెచ్చరించారు. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగంపై సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. చోరీలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ గంజాయి సాగు రవాణా, ఉద్యోగాల పేరుతో డబ్బు కోసం ప్రజల్ని పలు విధాలుగా మోసగించే నేరగాళ్ల గురించి తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు అధిక వేగంతో వెళ్లే వాహనదారులపై కూడలి ప్రదేశాలు ట్రాఫిక్ రద్దీలో కఠిన చర్యలు అవలంబిస్తామన్నారు ఆటోలు, జీపుల్లో గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాడేరు టౌన్ కూడలి ప్రాంతాల్లో వర్షాలతో మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఆసుపత్రి ప్రాంగణంలో పోలీస్ అవుట్ పోస్ట్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

విద్య, వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన ప్రాంతంలో విద్య, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అల్లూరి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అనంతగిరి మండల ప్రత్యేక అధికారి వివిఎస్ శర్మ హెచ్చరించారు. గురువారం మండలంలో పర్యటించారు. చిలకలగెడ్డ మండల పరిషత్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తక్కువగా వండటంపై ఉపాధ్యాయులపై మండిపడ్డారు. పాఠశాలకు హాజరు కాని టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. గుమ్మకోట గురుకుల పాఠశాలలో భోజన సదుపాయం సరిగా లేదని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సందర్శించారు. టీచర్స్ సమయపాలన, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ప్రిన్సిపల్, వార్డెన్ లను ఆదేశించారు. అనంతరం గుమ్మకోట సచివాలయం, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి నీలవేణి, సర్పంచ్ అప్పారావు, ఇన్చార్జి ఎంపీడీవో నగేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఐద్వా

అధ్వానంగా ఉన్న కుళాయిలను పరిశీలిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి-చింతూరు : ఏడుగు రాళ్లపల్లిలో మంచినీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని ఐద్వా అధ్యక్షురాలు మల్లం సుబ్బమ్మ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి వచ్చిన జలజీవన్ మిషన్ నిధులపై సమీక్ష చేపట్టాలని కోరారు. గురువారం గ్రామంలోని మంచినీటి సమస్యను స్థానిక మహిళలు సుబ్బమ్మ దృష్టికి తేగా, వారితో కలిసి గ్రామంలోని మంచినీటి పైప్‌లైన్లను పరిశీలించారు. పైపులైన్ అస్తవ్యస్తంగా ఉండి, కుళాయిలకు ట్యాప్‌లు లేక నీరు వృథా అవుతున్నట్లు గుర్తించారు. పైపులైన్ మరమ్మతులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా సుబ్బమ్మ మాట్లాడుతూ ఏడుగురాళ్లపల్లి గ్రామంలో రూ.లక్షలు ఖర్చుచేసి, జలజీవన్ మిషన్ పనులు చేపట్టినా, అధికారుల నిర్లక్ష్యం వల్లే తాగునీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. పంచాయతీకి కేటాయించిన జలజీవన్ మిషన్ నిధులు వినియోగంపై సమీక్షించి, వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళలతో ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మడకం, జానకమ్మ, వాడే రజిత, పెనుగొండ, తిరుపతమ్మ, ఎడమ లక్ష్మి, గంటల పార్వతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు : డిసెంబర్ 8 న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 24వ తేదీతో గడువు ముగుస్తుందని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ కలెక్ట్ రసీదు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్ష రాయుటకు అర్హులని తెలిపారు. విద్యార్థి ఆధార్ కార్డ్ లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేది, తండ్రి పేరు నమోదు చేయాలని, దరఖాస్తు చేసుకొనుటకు ధ్రువపత్రాలు అవసరం లేనప్పటికీ, పరీక్ష రాసే సమయమునకు అన్ని ధ్రువ పత్రములు సిద్ధం చేసికోవాలని స్పష్టం చేసారు. పరీక్షా రుసుము ఓసి, బిసి విద్యార్థులకు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50లు చెల్లించాలన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి- చింతపల్లి: పాడేరు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించినందుకు ఆ పార్టీ కార్యకర్తలు పశ్చాత్తాప పడుతున్నారని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వంపూరు గంగులయ్య అన్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆధ్వర్యంలో జనసేన సీనియర్ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు అధ్యక్షతన బెన్నవరం పంచాయితీ పోతురాజు గుమ్మాలు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయితీలోని పలువురు వైసీపీ కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. పార్లమెంట్ ఇన్చార్జ్ వంపూరు గంగులయ్య, కిముడు కృష్ణమూర్తి, అశోక్, బాలరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-అరకులోయ: గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గురువారం అరకులోయ మండల పరిషత్ సమావేశ మందిరంలో అరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 164 అంగన్వాడి సెంటర్లకు చెందిన అంగన్వాడీలు సిడిపిఓ డి.శారద ఆధ్వర్యంలో మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానికంగా దొరికే ఆకుకూరలు చిరుధాన్యాలు చోళ్లు,సామలు, జొన్న వంటివి వాడితే మెరుగైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. తినే ఆహారంలో పౌష్టిక ఆహారం లోపం ఉండడంతోనే రకరకాల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు.జెడ్పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎంపీడీవో వెంకటేష్ మాట్లాడుతూ, స్థానికంగా దొరికే కూరగాయలు, పిండి పదార్థాల్లోనే ఎక్కువ పోషక విలువలు ఉంటాయని ఆయన అన్నారు. అరకులోయ ప్రాజెక్టు సిడిపిఓ డి.శారద అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి సుస్మిత, ఎంపీటీసీ సభ్యులు రామ్మూర్తి, శత్రుగుణ, రామన్న, అంగన్వాడి సూపర్వైజర్లు పార్వతి, లక్ష్మీ,అరుణ, అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్య నాగమ్మ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

సామగ్రిని అందజేస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ:ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ స్పష్టం చేశారు. స్థానిక యూత్ శిక్షణ కేంద్రంలో ఆతిథ్య రంగంలో శిక్షణ పొందుతున్న 60 మంది గిరిజన యువతకు శిక్షణ సామాగ్రిని కిట్లను పిఓ చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద యువతకు శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. ఆతిథ్య రంగంలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. శిక్షణాకాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన 60 మంది యువతకు నాలుగు నెలలు శిక్షణ అందిస్తారని చెప్పారు. శిక్షణాకాలంలో ఉచితంగా భోజనం వసతి సౌకర్యం కల్పిస్తారని అన్నారు. ఇప్పటివరకు 178 మందికి శిక్షణ అందించగా 168 మంది వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలు పొందారని స్పష్టం చేశారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని ఉపాధి అవకాశాలు అందాలని చెప్పారు. ఆదిత్య రంగంలో విదేశాలలో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ మరియు శిక్షణ సంస్థ జేడీఎం కళ్యాణి, గురుకులం ప్రిన్సిపాల్ పి ఎస్ ఎన్ మూర్తి, దసపల్లా మేనేజర్ రత్నం పాల్గొన్నారు.

రక్తహీనత నిర్ధారణకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు:మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తలారి సింగి బాలికల ఏ.పి.ఆర్ స్కూల్ (పాడేరు)లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థినులకు సికిల్ సెల్ అనీమియా నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి . సి జమాల్ భాష ఆధ్వర్యంలో వైద్య అధికారులు, సిబ్బంది పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా పరిదిలో ఉన్న హాస్టల్స్ , స్కూల్ లలో వైద్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థినులను గుర్తించి గమ్మిస్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్కూల్లో వైద్య శిబిరం ద్వారా 85 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు . ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. జమల్ భాషా, ఏ.పి.ఆర్.స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్, టీచర్స్, ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, బి.లక్ష్మణ్, హెచ్.వి వి.వి.యల్ పాత్రో, ఏ.ఎన్.ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ గ్రామంలోని నేరేడువలసలో ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసి బహిరంగంగా నిర్మాణం చేపడుతున్నారని, తక్షణమే అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు పి.దొంబు, కార్యదర్శి టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అరకు పంచాయతీ నేరేడువలస గ్రామంలోని నేషనల్ హైవే 516 జాతీయ రహదారి పాత పోలీస్ స్టేషన్‌కి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నా పంచాయతీ, రెవిన్యూ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కొంతమంది గిరిజనేతరులు బినామీ పేర్లతో ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా పూర్తిస్థాయి దుకాణాలు, పెద్ద పెద్ద భవంతుల నిర్మాణాలు చేసుకుంటూ 1/70 చట్టాన్ని పూర్తిగా నీరు గారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని కాపాడాల్సిన అధికారులు గిరిజన నేతరులకు ఏ విధంగా నిర్మాణాలకు అనుమతిస్తున్నారో అర్థం కాలేదన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. గిరిజనేతురుల అక్రమ కట్టడాలకు ప్రోత్సహిస్తున్న పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పాడేరు: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, ఆశ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆశ సిహెచ్డబ్ల్యుల సమస్యలపై ఐటీడీఏ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డిఎం అండ్ హెచ్ ఓ, డీసీఎం అధికారులతో సమస్యలపై చర్చించారు, యూనియన్ నాయకులు దాసమ్మ, పద్మ, మంగమ్మ హాజరయ్యారు. అధికారులు అడిగిన పలు అంశాల పైన రాతపూర్వకమైన వినతి పత్రాన్ని ఇచ్చారు. పని చేసే గ్రామాలకు తప్ప పిహెచ్ లలో పని చేయిస్తున్నారని, రోజు ఇద్దరు చొప్పున డ్యూటీలు వేస్తున్నారని తెలిపారు. సబ్ సెంటర్లు మీటింగ్కి టిఏ, డిఏలు ఇవ్వకుండా పిలుస్తున్నారని వాపోయారు, కింద స్థాయి జరిగే ఏ మీటింగ్‌కు అయినా హాజరుకాని పక్షంలో జీతాలు కట్ చేస్తామని డాక్టర్లు బెదిరిస్తున్నారని తెలిపారు.

చార్టులను ఇస్తున్న ఆర్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి

పాఠశాలకు పరికరాల వితరణ

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని మారుమూల కివర్ల పంచాయతీ టంగలబంధ ప్రాథమిక పాఠశాలకు రాజమహేంద్రవరం ఆర్ఎస్ సేవ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి కుర్చీలు, టేబుల్ పటిక బోర్డు, ఆట వస్తువులు, ఇతర పరికరాలు అందజేశారు. మండల విద్యాశాఖ అధికారులు టీచర్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ విషయం పలు దినపత్రికల్లో వచ్చిన వార్త కథలకు స్పందించిన ఆర్ఎస్ సేవా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ కాంత్ స్వాతి ముందుకు వచ్చి సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె, గోవిందరావు, గ్రామస్తులు పి,బుచ్చన్న, సన్యాసిరావు పాల్గొన్నారు

యువతే దేశ భవిష్యత్

కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్

ప్రజాశక్తి -మధురవాడ: దేశ భవిష్యత్ యువతేనని కేంద్ర సామాజిక న్యాయం, సాధికార శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ అన్నారు. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలోని గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్‌ను ఆయన ఎన్ఎపిడిడిఆర్ కార్యక్రమంలో భాగంగా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ వ్యసన విమోచనలో చికిత్స పొందుతున్న యువత, ఇతర రోగులతో మాట్లాడారు. ఇక్కడ చికిత్స పొంది వ్యసనం నుంచి విమోచన పొంది ఇక్కడే పనిచేస్తున్న వారితోనూ, చికిత్సతో నయమైన వారితో ఆయన మాట్లాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణి

టెన్త్‌లో శతశాతం ఫలితాలే లక్ష్యం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : విద్యార్థులు బాగాచదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎం.శ్రీను, ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షలలో మంచి గ్రేడింగ్‌తో విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలలోని ఆర్ఓ ప్లాంట్‌ను వీలైనంత త్వరలో మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తామన్నారు. హెచ్ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ,ఈ ఏడాది పదోతరగతిలో నూరు శాతంఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికా సిద్ధం చేసి, దాని అమలుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులుఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్రాపల్లి బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి -సీలేరు: చట్రాపల్లి కొండచరియలు విరిగిపడిన ఘటనలో గాయపడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలను భారత చైతన్య యువజన పార్టీ, పాడేరు లీగల్ అడ్వైజర్ రాజన్న పరామర్శించారు.బాధితులకు కొంత ఆర్థికసాయం అందించి, వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్నివిధాలా నష్టపోయిన బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు తన వంతు పోరాటం చేస్తానన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి,వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టేకు పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.పది వేలు విలువ చేసే టేకకలపను బుధవారం రాత్రి స్థానిక ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు, ఫారెస్ట్ రేంజర్ ఎంఅబ్బాయి దొర తెలిపిన వివరాలివి. మండలంలోని ఒట్టిగడ్డ గ్రామం నుండి అనకాపల్లి జిల్లా పాత కృష్ణదేవి పేట గ్రామానికి వ్యాన్‌లో తరలిస్తున్న టేకు మంచం కలపను ముందస్తు సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు పట్టుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కలపను స్వాధీనం చేసుకొని, వ్యాన్ సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఎస్ఓ రాము తెలిపారు. దాడుల్లో ఎఫ్ బిఒ ప్రసాదు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్గానిక్ దుస్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సేంద్రీయ పత్తి, ప్రకృతి సిద్ధమైన రంగులను ఉపయోగించి వస్త్రాలను వాడుకలోకి తెచ్చినట్టు నీత్ డిజైనర్స్ వ్యవస్థాపకురాలు లక్ష్మి కొండాల తెలిపారు. చిన్న పిల్లల కోసం రూపొందించిన ఈ సురక్షితమైన, పర్యావరణ అనుకూలమైన దుస్తులు ఎంతో మేలైనవని అన్నారు. అందరికీ అవగాహన కల్పించేందుకు 'వేర్ థ ఛేంజ్' నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం విశాఖలోని వి - హెల్త్ కేర్‌లో ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో వి - హెల్త్ కేర్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మట్లాడారు. పసిపిల్లల లేలేత చర్మ ఆరోగ్యం కోసం అర్గానిక్ దుస్తులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మి కొండాల తమ ఉత్పత్తుల గురించి వివరించారు. నవంబరు 10వ తేదీన సిరిపురం చిల్డ్రన్ ఎరీనాలో కిడ్స్ ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామని తెలిపారు.

శిథిల భవనంలోనే చదువులు

భయాందోళనకు గురౌతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని పనసలపాడు గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడంతో గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. భవనం పైకప్పు పెచ్చులూడడడంతోపాటు బీటలు పడిన గోడలతో ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదం పొంచ్చి ఉందని స్థానిక గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. దీనిపై అనేకసార్లు మొరపెట్టుకున్నప్పటికీ అధికారులు ఎవరూ స్పందించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . వర్షాలు పడితే స్కూల్ ప్రాంగణమంతా బురద నీటిమయం కావడంతో ప్రమాదం మరింత ఎక్కువవుతుందని అంటున్నారు. పూర్తిగా అధ్వానస్థితిలో ఉన్న మరుగుదొడ్లు, పాఠశాల భవనంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ, పలుమార్లు విన్నవించినా, దీనిపైపు కన్నెత్తిచూసే వారు లేకుండా పోయారని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామంలో అంగన్వాడీ భవనం కూడా అద్దెఇంట్లోనే కొనసాగుతోందని గ్రామస్తులు అంటున్నాఉ. దీనిపై స్థానిక ఎంపిడిఒతోపాటు సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అంగన్వాడీ భవనానికి రూ.పది లక్షలు మంజూరయ్యాయని, పదిరోజుల్లో పనులు చేపడతామని పిఆర్ జెఇ రామకృష్ణ తెలిపారు.. అలాగే ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనం, మరుగుదొడ్ల పునర్నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌తోపాటు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిల పాఠశాల భవనం ఇదే..

అచ్యుతాపురంలో నేడు కార్మిక రక్షణ యాత్ర సభ

హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు - నేటితో ముగియనున్న బైకు ర్యాలీ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఫార్మా, సెజ్ ఉద్యోగులు, కార్మికుల భద్రతకు సిపిఎం చేపట్టిన రక్షణ యాత్ర బైక్ ర్యాలీ శుక్రవారంతో ముగియనుంది. సోమవారం పాయకరావుపేట గ్రంథాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక, అనకాపల్లి, పరవాడ మండలాల్లోని పలు గ్రామాల మీదుగా సాగింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు బైక్ ర్యాలీ కొనసాగించి సాయంత్రం నాలుగు గంటలకు అచ్యుతాపురం జంక్షన్‌లో ముగింపు సభ చేపట్టనున్నారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రక్షణ యాత్ర తలపెట్టినన్ని రోజులూ నిర్వాసిత, కార్మికుల నివాసిత, పారిశ్రామిక ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, రాత్రుల్లో గ్రామాల్లోనే యాత్రా బృందం సభ్యులు ఉన్నారు. వారి దృష్టికి కాలుష్య, ఉపాధి సమస్యలను ప్రజలు తీసుకొచ్చారు. వలస కార్మికుల చట్టం అమలు చేయకపోవడంతో తక్కువ జీతాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రమాద ప్రదేశాల్లో పలువురు పనిచేస్తున్నట్టు తేలింది.

చట్టబద్ధమైన నిబంధనలను పక్కనబెట్టి, యాజమానులకు అనుకూలమైన విధానాల అమలు ఫలితంగా ప్రమాదాల రూపంలో వాటి దుష్ఫలితాలు కనబడుతున్నా ప్రభుత్వాలు సమీక్షించడంలేదు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల భద్రతను విస్మరిస్తున్నాయి. ఎసెన్షియా కంపెనీలో 17 మంది, సినర్జిన్ కంపెనీలో నలుగురు మృతికి కారణమైన యాజమానులపై ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించింది తప్పితే ప్రమాద తీవ్రతకు తగిన కేసులు నమోదుచేయలేదు. భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని యాజమానులు గుర్తించేలా ప్రభుత్వ తీరులేదు. ఈ నేపథ్యంలో అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యాలు భద్రతపై చూపుతున్న నిర్లక్ష్యాన్ని కార్మికులు, ఉద్యోగులు, ప్రజల్లోకి తీసుకెళ్లి.. ప్రమాదాల నియంత్రణకు ఒత్తిడి తేవాల్సిన ఆవశ్యకతను వివరించేందుకు ఐదు రోజుల పాటు సిపిఎం ఈ రక్షణ యాత్ర చేపట్టింది. ఆ లక్ష్యం నెరవేరింది. పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం నేతృత్వాన సాగిన బైక్ ర్యాలీలో జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు సహా జి.నాయినిబాబు, శివాజీ, సోమునాయుడు, నర్సింహమూర్తి, తౌడన్నదొర, దేముడు నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, చలపతి, వరహాలు, నూకన్న ఉన్నారు.

21న గురజాడ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురజాడ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కవితలు, హెరీలా హప్ పోటీలు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. జయంతి సభ అనంతరం పోటీలో పాల్గొన్న కళాకారులకు, విద్యార్థులకు అతిథులచే బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. సీనియర్ జర్నలిస్టు నాగబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాకవి గురజాడ అప్పారావు అడుగుజాడలో ప్రస్తుత సమాజం నడవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

వైద్యం అందక రోగుల ఇక్కట్లు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని రాజవొమ్మంగి, లాగరాయి, జడ్డంగి పిహెచ్‌సిలలో గురువారం వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ ఆందోళనకు వెళ్లిన వైద్యులు ఇంకా చేరుకోకపోవడంతో సకాలంలో వైద్య సేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు వస్తారని గంటల తరబడ నిరీక్షించిన రోగులు సేవలు అందకపోవడంతో, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించారు. పిహెచ్‌సిలో ఒక స్టాఫ్‌నర్స్ మాత్రమే ఉండడంతో రోగులను పరీక్షించడం, మందులు, ఇంజక్షన్లు ఒక్కరే చేయాల్సిన పరిస్థితుల్లో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రాజవొమ్మంగి పిహెచ్‌సికి వచ్చే రోగుల తాకిడి దృష్ట్యా సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసి, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించాలని, అవసరమైన మంఉదుల అందుబాటులో ఉంచాలని న్యాయవాది ఎస్ దత్తాత్రేయ కోరారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు రాజేంద్రపాలెంలో సిద్ధి వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామస్తులు,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అంతకుముందు స్థానిక మహిళలు గణనాథునికి ప్రత్యేక పూజలు చేయగా, మేళతాళాలు, యువకులుడిజె నృత్యాల మధ్య వినాయకుని నిమజ్జనం చేశారు.

మెటల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - దేవీపట్నం: దేవీపట్నం మండలం ఇందుకూరు కృష్ణుని ఆలయం నుంచి ఆర్అండ్ఆర్ కాలనీ-1 వరకు మెటల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి, ఉన్నతాధికారులకు నివేదించినట్లు అధికారులు వెల్లడించారు. అనుమతులు మంజూరైనవెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ రోడ్డులో కంకర లేచి, అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు, సమస్యను పలుమార్లు దేవిపట్నం సర్పంచ్ కుంజం రాజమణి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి, రోడ్డు నిర్మాణానికి పంచాయతీ తరపున తీర్మానం చేసి అధికారులకు నివేదించగా, దానిపై అంచనా ప్రతిపాదనలు రూపొందించి, మంజూరుకు నివేదించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : 11కెవి జడ్డంగి ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా రాజవొమ్మంగి మండలంలోని అమీనాబాద్, చెరుకుంపాలెం చికిలంత, దూసరపాము, జడ్డంగి, కింద్ర, లబ్బర్తి, లాగరాయి, లోదొడ్డి, మారేడుబాక, తంటికొండ, వాతంగి, వంచంగి తదితర పంచాయతీల గ్రామాలకు ఈనెల 20న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ డిఇఇ బి.దివాకరరావు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పిడిఎస్ఓ నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ మెడికల్ కమిషన్ ఈ సంవత్సరం రాష్ట్రంలో అడ్మిషన్లకు అనుమతి మంజూరు చేసిన రెండు కళాశాలల్లో పులివెందులలో ఉన్న వైఎస్ఆర్ వైద్య కళాశాల అనుమతిని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మెడికల్ కమిషన్ డైరెక్టరేట్ ఎన్ఎంసికి రాసిన లేఖను ఖండిస్తూ పిడిఎస్ఓ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన కృష్ణా కళాశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడారు.